పేదలపై 'పచ్చ' కుట్రలు

- ఇళ్ల నిర్మాణాలకు అడుగడుగునా ఆటంకాలు
- ఆవేదనలో లబ్ధిదారులు


పునాదులు తీయించేందుకు వచ్చిన లబ్ధిదారులు (ఫైల్)

కదిరి అర్బన్: వారంతా నిరుపేదలే. రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలు. అలాంటి వారి జీవితాలకు నేనున్నానని భరోసా ఇచ్చారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎన్నో ఎళ్ల వాళ్ల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాకారం చేశారు. అయితే, ఆ ఇళ్ల నిర్మాణాలు జరగకుండా టీడీపీ నాయకులు అడుగడుగునా అడ్డు తగులుతున్నారు.

అన్ని సరిగానే ఉన్నా అడ్డంకులు

కదిరి మండలం గంగన్నగారిపల్లిలో 1997లో అప్పటి ప్రభుత్వం సర్వే నంబర్ 1379 -2బీలో పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు 1.50 ఎకరాల భూమిని అనుభవదారులైన బిట్ర రెడ్డెప్ప,చెరువు బయప్ప అనే వ్యక్తుల నుంచి అప్పటి మార్కెట్ వాల్యూ ప్రకారం పరిహారం చెల్లించి స్వాధీనం చేసుకుంది. 60 మందికి ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేసింది. అయితే, ఇళ్లు నిర్మించుకునేందుకు పట్టాలు పొందిన వారు ఆసక్తి చూపలేదు. ఊరికి దూరంగా ఉండడంతో నివాసాలు ఏర్పాటు చేసుకోలేమని పట్టాలు పొందిన వారు రెవెన్యూ వారికి రాతపూర్వకంగా రాసిచ్చారు. ఆ భూమిలో ప్రస్తుత ప్రభుత్వం జగనన్న కాలనీ ఏర్పాటు చేసింది. 120 మంది నిరుపేదలకు పట్టాలను మంజూరు చేసింది. ఇంటి పునాదులు తీసేందుకు లబ్ధిదారులు వెళ్తే టీడీపీ నాయకులు అడ్డుకోవడం పరిపాటిగా మారిపోయింది. దీంతో పోలీసుల పహారాతో ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు.

తహసీల్దార్‌కు బెదిరింపులు..

ఆ స్థలం పట్ల నీకెందుకు అంత ఇంట్రస్ట్ అని తహసీల్దార్ సునీతను ఓ టీడీపీ నాయకుడు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. 'సమస్యల్లో పడతావ్. భవిష్యత్తులో నీకు సమస్యలు వస్తాయ్, లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ క్రియేట్ చేస్తాం అని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఈ విషయంపై తహసీల్దార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలను సాధించే క్రమంలో తాము విధులు నిర్వహిస్తున్నామన్నారు. '1379-2బీ పూర్తిగా ప్రభుత్వ భూమి. 1997లో అప్పటి మార్కెట్ వాల్యూ ప్రకారం రూ.50,250 పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకుంది. ఇందుకు సంబంధించిన ఫైల్ ఉంది. కొందరు భూసేకరణ విషయం దాచి పెట్టి కోర్టుకు వెళ్లినట్లు తెలుస్తోంది. మాకు కోర్టు నుంచి ఎలాంటి ఆర్డర్ రాలేదు. మేము కౌంటర్ కూడా వేశాం. మీ దగ్గర కోర్టు ఆర్డర్ తీసుకుని రండి మేము భూమి వద్దకు రామని చెప్పాను. వాళ్ల వద్ద ఇంటీరియం ఆర్డర్‌కానీ, స్టేకానీ లేవు. భవిష్యత్తులో అక్కడ ఇంటి నిర్మాణాలకు ఎవరైనా అడ్డు తగిలితే పోలీసులకు ఫిర్యాదు ఇమ్మని మా సిబ్బందికి, హౌసింగ్ వాళ్లకు చెప్పా.' అని తెలిపారు.

మేము పేదలం కాదా?



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మా మొర ఆలకించి ఇళ్లు మంజూరు చేశారు. కట్టుకుందామంటే టీడీపీ వాళ్లు అడ్డు తగులుతున్నారు. పేదలంటే ఎందుకంత కోపం.
– కౌసల్య, లబ్ధిదారు, కుమ్మరవాండ్లపల్లి

అడ్డుకోవడం తగదు



కదిరి పట్టణంలో మాతో పాటు ఇళ్లు మంజూరైన వారు నిర్మాణాలు పూర్తి చేసుకుని కాపురం ఉంటున్నారు. మా కర్మ ఇంతవరకు పునాదులు కూడా తీయలేని పరిస్థితి. ఇక్కడ టీడీపీ నాయకులు ఆ ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవడం తగదు.
– అంజనమ్మ, కుమ్మరవాండ్లపల్లి

క్లుప్తంగా

టెట్రా ప్యాకెట్ల స్వాధీనం

పుట్టపర్తి టౌన్: శ్రీసత్యసాయి జిల్లా సెబ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శుక్రవారం పెనుకొండ సెబ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించారు. ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి 86 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ మద్యం తరలించిన అమ్మిన వారిపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. కేసులు నమోదు చేసిన మార్పు రాకపోతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

రూ.80,829 రికవరీకి ఆదేశం


మాట్లాడుతున్న ఎంపీపీ అమరనాథ్ రెడ్డి

కదిరి అర్బన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం 16 విడత సామాజిక తనిఖీపై ప్రజావేదిక జరిగింది. మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై పంచాయతీల వారీగా సామాజిక తనిఖీ అధికారులు తనిఖీలు చేపట్టారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.8,13,42,524 ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఇందులో రూ.80,829 రికవరీకి ఆదేశించినట్లు ఎంపీడీఓ అంజనప్ప తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రామాంజనేయులు, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, ఏపీడీ శివశంకర్, ఏపీఓ శ్రీధర్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఊతకర్రల పంపిణీ


వృద్ధులకు ఊతకర్రలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ముదిగుబ్బ: ముదిగుబ్బ గేట్ కొట్టాలలో శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. గద్వాల అజారుద్దీన్, సుజీ కుల్లాయప్ప, హుస్సేన్ పీరా ఆధ్వర్యంలో 20 వాకర్లు, 15 ఊత కర్రలను వృద్ధులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సీవీ నారాయణ రెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణ రెడ్డి, కిరణ్‌మోహన్ రెడ్డి, లోకేశ్వ రెడ్డి, వెంగల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. సానేవారిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో బుక్కులు, పెన్నులు తదితర సామగ్రి అందజేశారు.

యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: ప్రభుత్వం నిరంతరాయంగా ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే డా పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రవేట్ సంస్థలతో అనుసంధానం చేసుకుని విస్తారంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. ఈ జాబ్‌మేళాలో మీ ప్రతిభకు తగిన ఉద్యోగాలు ఎంపిక చేసుకుని జీవితంలో స్థిరపడాలని యువతకు సూచించారు. ఈ జాబ్ మేళాలో 14 కంపెనీలు పాల్గొన్నాయి. జాబ్‌మేళాకు 409 మంది అభ్యర్థులు హాజరుకాగా.. అందులో 148 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో స్కిల్ డెవెలప్‌మెంట్ జిల్లా అధికారి అబ్దుల్ ఖయ్యూమ్, కళాశాల ప్రిన్సిపాల్ డా.స్మిత, నాయకులు రంగారెడ్డి, మధుసూదన్ రెడ్డి, మణికంఠ నాయక్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ


వస్త్రాలు పంపిణీ చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి

తాడిమర్రి: ప్రజా సంక్షేమమే పరమావధిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి కృషి చేస్తున్నారని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సింగిల్‌విండో అధ్యక్షుడు వైటీ చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు, నాయకులు, కార్యకర్తలతో కలసి ఎమ్మెల్యే కేతిరెడ్డి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం 20 మంది పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆనందరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు బాబాఫకృద్దీన్, హనుమంతు, విశ్వనాథ్, లక్ష్మన్న, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు



కనగానపల్లి: కనగానపల్లి కేజీబీవీకి చెందిన తొమ్మిది మంది విద్యార్థినులు రాష్ట్ర స్థాయి బేస్ బాల్, స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఎస్ఓ నరసమ్మ తెలిపారు. బేస్‌బాల్‌లో ప్రత్యూష, జ్యోతి, రేష్మా, హారిక , శివకుమారి, అక్షయ, రూపశ్రీ, స్విమ్మింగ్‌లో ప్రత్యూష, అంబికా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ అవకతవకలపై విచారణ

నల్లమాడ: మండలంలోని దొన్నికోట పంచాయతీ బొగ్గలపల్లి గ్రామంలో పంట నమోదు (ఈ-క్రాప్ బుకింగ్)లో గ్రామ ఉద్యానవన అధికారి అవినీతి, అక్రమాలు పాల్పడ్డారని గురువారం పలువురు రైతులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పంటలు సాగు చేయని బీడు భూముల్లో పంట సాగు చేసినట్లు నమోదు చేశారని ఆరోపించారు. శుక్రవారం కదిరి ఏడీఏ సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి సుమతి, ఉద్యానశాఖ అధికారి నవీన్‌తో కలసి విచారణ నిర్వహించారు. రైతులు ఆరోపించినట్లుగా పంట సాగు చేయని భూమిలో ఈ-క్రాప్ బుకింగ్ చేసినట్లు గుర్తించడం జరిగిందన్నారు. తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఏఓ సుమతి తెలిపారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

గాండ్లపెంట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 30 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాలుగున్నరేళ్లలోనే చేసి చూపించారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి కొనియాడారు. స్థానిక ఎస్ఆర్ పంక్షన్ హాల్‌లో శుక్రవారం మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యేను మండల నాయకులు, కార్యకర్తలు ఘనంగా గజమాలతో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మన ప్రభుత్వం చేసిన మంచిని, చంద్రబాబు అవినీతి పాలనను ధైర్యంగా ప్రజల చెంతకు వెళ్లి వివరించాలన్నారు. మండలంలోని 7 గ్రామ సచివాలయాలను నిర్మించి గ్రామాల్లోనే సేవలు అందించడం జరుగుతోందన్నారు. రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ క్లినిక్‌లు నిర్మించడం జరిగిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించడం, నాడు-నేడు ద్వారా కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం లాంటి అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వం అమలు చేసిన 33 రకాల సంక్షేమ పథకాలు వివరించాలన్నారు. దశాబ్దాలుగా సాగునీరు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. స్పందించిన సీఎం జగన్ వెంటనే ఎత్తిపోతల పథకం ద్వారా రూ.46 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. హంద్రీ-నీవా జలాలతో 32 చెరువులను నీటితో నింపడం వంటి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అదే విధంగా మండలంలో అప్పటి చంద్రబాబు పాలనలో రెండు గ్రామాలకే మాత్రమే రోడ్లు వేశారన్నారు. నేడు మారుమూల గ్రామాలకు సైతం వంద సంవత్సరాల మన్నిక కలిగిన రోడ్లను ఏప గ్రామాలకు వేశామో, అభివృద్ధి ఏమిటో చేసి చూపించామని గణంకాలతో సహా వివరించారు. ప్రతి మండల కేంద్రంతో పాటు బాలికల చదువుకు ఆటంకం కలగకూడదని కస్తూరిబా పాఠశాలలో ఇంటర్ విద్య ప్రవేశపెట్టడం జరిగిందని వెల్లడించారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాలల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచుకుంటూ పోతూ జనవరి నాటికి రూ.3 వేలు మంజూరు చేయడం ఇలాంటి కార్యక్రమాలు విస్తృతంగా ప్రజలకు వివరించాలన్నారు. వచ్చే నెల నవంబరు 1వ తేదీ నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ 100 ఇళ్లపై పార్టీ జెండా ఎగిరే విధంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లు పని చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ తాతం జగన్నోహన్, వైస్ ఎంపీపీ గంగోజమ్మ, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, బీసీ కన్వీనర్ జక్కల లక్ష్మీనరసింహగౌడ్, సర్పంచులు రహంతుల్లా, రవీంద్రనాయక్, సొసైటీ అధ్యక్షుడు ఎస్పీ హైదర్‌వలీ, మాజీ అధ్యక్షుడు వెంకటరమణా రెడ్డి, ఆర్బీకే చైర్మన్ శంకర్‌నాయుడు, ఎంపీటీసీలు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కే.బ్రాహ్మణపల్లి పంచాయతీ నుంచి వీరచిన్నయ్యగారి పల్లి వరకూ రూ.42 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యంతో గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే గ్రామాల రూపురేఖలు మారిపోయాయని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అప్రోచ్ రోడ్లు వేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి కాగితాల్లో మాత్రమే కనిపిస్తుందని తెలిపారు. అయితే మన ప్రభుత్వంలో అభివృద్ధి కళ్లకు కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఖుర్షిద్, నాయకులు మధుకర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, రఫీ, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రసాద్, సోముశేఖర్‌రెడ్డి, లోకేష్ పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం


పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: సంక్షేమ పథకాలు ప్రజలందరికీ ఎలా వర్తింపజేయాలో పరితపించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, రాబోవు ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో టీడీపీ హయాంలో రాక్షస పాలన చూశామన్నారు. ప్రస్తుతం బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి, రైతు పక్షపాతి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా 18 వేల ఇళ్లు మంజూరు చేశామన్నారు. మరో 8 వేల ఇళ్లకు అనుమతి పొంది, అర్హులందరికీ ఇళ్లు ఇప్పించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పరిటాల కుటుంబం మంత్రులు, ఎంఎల్ఎలుగా పదవులు అనుభవిస్తూ ప్రజలకు చేసిందేమీలేదన్నారు. దోచుకొని దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ స్కామ్‌లో రూ.370 కోట్లతో ప్రజాధనాన్ని దోచుకొని, దొరికిన చంద్రబాబు జైలుకు వెళ్తే సునీత రాద్ధాంతం చేస్తోందన్నారు. పరిటాల రవీంద్ర జైలులో ఉన్నప్పుడు ఏనాడూ ధర్నా చేయలేదన్నారు. నాలుగేళ్లలో పేరూరు డ్యాంను హంద్రీనీవా నీటితో నింపామన్నారు. ముత్యాలమ్మ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకొచ్చి, రామగిరి బంగారు గనులు తెరిపించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు.

సునీత మాటలు నమ్మే పరిస్థితి లేదు..

మహానటి పరిటాల సునీత మాయ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలేదని, ఒక్కసారిగా అధికారం పోతానే దిక్కుతోచని స్థితిలో గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. రాబోవు ఎన్నికల్లో ప్రజలు మరోసారి వైఎస్సార్‌సీపీకే పట్టం కడతారన్నారు. ముందుగా పాపిరెడ్డిపల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అంకాల్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతకు ముందు రామగిరిలోని వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మీనుగ నాగరాజు, కన్వీనర్ కత్రాహను మంతరెడ్డి, తహసీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీఓ ఫజిల్‌బాషా, సీఐ చిన్నగౌస్, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యే కేతిరెడ్డిని సత్కరిస్తున్న చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి దంపతులు, చేనేత నాయకులు


ధర్మవరంలో ఎమ్మెల్యే కేతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోటి సూర్యప్రకాష్ బాబు


ధర్మవరంలో రక్తదానం చేస్తున్న యువత


బత్తలపల్లి కూడలిలో కేక్ కట్ చేస్తున్న నేతలు

ధర్మవరం: ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మెన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం తదితరులు ఎమ్మెల్యే కేతిరెడ్డిని గజమాలతో సత్కరించారు. అలానే వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ సెల్, మైనార్టీ విభాగం, మహిళా విభాగం, చేనేత విభాగం నాయకులు నోటు పుస్తకాలు ఇచ్చి, భారీ కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే కేతిరెడ్డి నివాసం వద్ద వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 72 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. స్థానిక 9వ వార్డులో పట్టణ సచివాలయాల కన్వీనర్ మాసపల్లి సాయికుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అన్నదానం చేశారు.

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు 28వ వార్డు ఇన్‌చార్జ్ సరితాల బాషా ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. అన్నదానం చేశారు.

బత్తలపల్లి: ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి ఆధ్వర్యంలో బత్తలపల్లి కూడలిలో ఘనంగా జరుపుకున్నారు. లలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరుడి ఆలయంలో ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాష్‌బాబు, ఉప సర్పంచు కోటి గోపీనాథ్, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 44 కేజీల కేక్‌ను ధర్మవరానికి తీసుకువెళ్లి ఎమ్మెల్యే చేతుల మీదుగా కట్ చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈశ్వరయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, రెడ్డి సంఘం నాయకులు అశోక్‌కుమార్‌రెడ్డి, నాయకులు షాషావలి, పామాల రమేష్, బండి వీరనారప్ప, రాజవీరారెడ్డి, ఉపేంద్రరెడ్డి, మల్లిరెడ్డి, వెంకటరెడ్డి, సీతారామిరెడ్డి, కుమ్మర క్రిష్టా, మండి నాగభూషణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్టీసీ బస్సు బోల్తా

ఓడీచెరువు: మండలంలోని కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై అల్లాపల్లి, గౌనిపల్లి మధ్యలో శుక్రవారం హిందూపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. కండక్టర్ రాజేశ్వరి, జీనులవాండ్లపల్లికి చెందిన రమణమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సల నిమిత్తం వీరిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హైవే రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండటంతో వేగంగా వెళ్తున్న బస్సు రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లడంతో ప్రమాదం జరిగింది. ఇద్దరు మినహా ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు.

సందడిగా వాక్ ఫ్రీడమ్ ర్యాలీ

కదిరి అర్బన్: మూమెంట్ ఇండియా సౌజన్యంతో మదనపల్లికి చెందిన జ్యోతి సొసైటీ, ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో వందలాది మంది విద్యార్థులు వాక్ ఫ్రీడమ్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ నారాయణరెడ్డి, ధాత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు సంకారపు స్వాతి చక్రపాణి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ ప్రశాంత్, ఎంఈఓ చెన్నకృష్ణ పాల్గొన్నారు.

సిమెంట్ బల్లల వితరణ

ముదిగుబ్బ: మండల పరిధిలోని మల్లేపల్లి జిల్లా పరిషత్ పాఠశాల పూర్వపు విద్యార్థులు శుక్రవారం పాఠశాలకు ఆరు సిమెంట్ బల్లలను వితరణ చేశారు. కార్యక్రమంలో రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చెన్నకేశవరెడ్డి, మద్దన్నగారిపల్లికి చెందిన నరసింహయాదవ్, ఆకుతోటపల్లికి చెందిన బొగ్గు విశ్వనాథ్, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు శంకర్ శెట్టి వంశీ, ఉపాధ్యాయులు షాకీర్, వెంకటనారాయణరెడ్డి, రవి, వంశీ, రజనీకాంత్, సులేమాన్, శంకర్, కిషోర్, నరసింహమూర్తి, రోజారమణి, లక్ష్మీనరసమ్మ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా



పుట్టపర్తి టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బుక్కపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జగదీష్ తెలిపారు. 87 కేజీల విభాగంలో సుభాష్, 77 కేజీల విభాగంలో గణేష్‌రెడ్డి, 73 కేజీల విభాగంలో చరణ్‌కుమార్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు త్వరలో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శుల నియామకం

కదిరి అర్బన్: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా కదిరి పట్టణానికి చెందిన అహమద్ హుసేన్, షాన్‌వాజ్‌ను నియమిస్తూ ఆ పార్టీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని కార్యదర్శులు పేర్కొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండల వ్యాప్తంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేయాలని బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అధికారులకు సూచించారు. 2వ విడత హౌసింగ్ నిర్మాణాలపై ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. మెదటి విడత ఇళ్ల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. రెండో విడతలో హౌసింగ్ నిర్మాణాల్లో భాగంగా లబ్ధిదారులను గుర్తించి నిర్మాణాలు త్వరగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మండల అగ్రిబోర్డు చైర్మన్ వెంకటచౌదరి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రామ్‌ప్రసాద్‌కు డాక్టరేట్

గాండ్లపెంట: కటారుపల్లి పంచాయతీ ద్వారనాల గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, దశరథరామయ్యల కుమారుడు నల్లసాని రామ్‌ప్రసాద్ శుక్రవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో డాక్టరేట్ అందుకున్నారు. ఆచార్య లక్ష్మీకాంతం జీవితం, రచనలపై రామ్‌ప్రసాద్ పరిశోధనలు చేశారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ చాన్సలర్, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి నరసింహారెడ్డి, వైస్ చాన్సలర్ ఆచార్య బి.జేరావు, యూజీసీ చైర్మన్ ఎం.జగదీష్ చేతులమీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

కుర్చీల వితరణ

ఎన్‌పీకుంట: స్థానిక మండల విద్యాధికారి కార్యాలయానికి మండల కేంద్రానికి చెందిన ఎస్ఆర్ఐ అచ్చిరెడ్డి గారి నాగిరెడ్డి రూ.40,000 విలువ చేసే కుర్చీలను వితరణ చేశారు.

కొనసాగుతున్న వైద్య శిబిరాలు

సాక్షినెట్‌వర్క్: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు కొనసాగుతున్నాయి. కదిరి మండలం కే.బ్రాహ్మణపల్లిలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు వైద్య సేవలందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అలాగే పుట్టపర్తి, తనకల్లు, నల్లమాడ, ఎన్‌పీకుంట, కొత్తచెరువు, ముదిగుబ్బలో ప్రజాప్రతినిధులు, వైద్యుల ఆధ్వర్యంలో హెల్త్‌కిట్లను పంపిణీ చేశారు.

కుటుంబానికి అండగా ఉంటాం

పుట్టపర్తి టౌన్: పట్టపర్తిలో నూతనంగా నిర్మిస్తున్న భవనం మీద నుంచి ప్రమాదవశాత్తూ కింద పడటంతో బుక్కపట్నానికి చెందిన ముస్కీన్ వలి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బుక్కపట్నం మండల నాయకులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకుడు గోవర్ధన్ రెడ్డి, మండల అగ్రిబోర్డు చైర్మన్ వెంకటచౌదరి, డీలర్ నాగభూషణ, పతంజలి, నారాయణస్వామి, మునాఫ్ పాల్గొన్నారు.